క్లుప్తంగా

ముమ్మరంగా జాతీయ రహదారి పనులు

పెద్దకొత్తపల్లి: జిల్లాలోని కల్వకుర్తి నుంచి ఏర్పాటు చేయనున్న జాతీయ రహదారి నిర్మాణానికి మండల కేంద్రంలో అధికారులు కొలతలు చేపట్టారు. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ చేపడతారని వ్యాపారులు భయాందోళనకు చెందతున్నారు. బస్టాండ్ కూడలిలో వంద ఫీట్ల వరకు విస్తరిస్తారని స్థానికులు భావిస్తున్నారు. అయితే ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం 50 ఫీట్ల వరకు రోడ్డు నిర్మాణం చేపడుతామని చెబుతున్నారు. మండల కేంద్రంలో రోడ్డు ఎంత చేపట్టే విషయం కొలిక్కి రాకపోవడంతో ఇరువైపులా ఉన్నవారు ఆందోళన చెందుతున్నారు.

పల్లె దవాఖాన పనుల పరిశీలన

వెల్దండ: గ్రామాల్లో పేదప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి పల్లె దవాఖానలు ఏర్పాటు చేస్తుందని సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. శనివారం కొట్రలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానా పనులు పూర్తి కావడంతో వాటిని పరిశీలించారు. వచ్చే నెలలో వైద్యశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా పల్లె దవాఖానాను ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. ఎంపీటీసీ రాములు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

వెల్దండ: విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కేంద్రియ ఆయుర్వేద విజ్ఞాన పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జీపీ ప్రసాద్, సంతోష్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని గుండాలలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీసుకోవాల్సిన ఆహారం తదితర వాటిని వివరించారు. రాగిజావ తయారు చేసే విధానాన్ని వారికి వివరించారు. సిబ్బంది శ్రీనివాసరావు, రవిబాబు, సరస్వతి తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులను ఆదుకోవాలి

కల్వకుర్తిరూరల్: రాష్ట్రంలో గ్రూప్–1 పరీక్ష రాసిన విద్యార్థులు, నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం కల్వకుర్తిలో విలేకరులతో మాట్లాడారు. పరీక్ష పేపర్ లీకయ్యిందనే కారణంతో పరీక్షలు రద్దుచేశారని, రెండోసారి ఓ ఎంఆర్ షీట్ లేదని హైకోర్టు పరీక్షలను రద్దు చేస్తూ.. ఆదేశాలు జారీ చేసిందన్నారు. పరీక్ష రాసిన నిరుద్యోగులకు రూ.1.50లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజేందర్‌గౌడ్, రవిగౌడ్, వివేకానంద పాల్గొన్నారు.

మహిళా కమిటీ ఎన్నిక

కల్వకుర్తిరూరల్: మాలమహానాడు కల్వకుర్తి పట్టణ మహిళా కమిటీని శనివారం ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షురాలిగా నవ్యశ్రీ, ఉపాధ్యక్షురాలిగా మణెమ్మ, ప్రధాన కార్యదర్శిగా తిరుపతమ్మ, సాలమ్మ, వర్కింగ్ ప్రసిడెంట్‌గా కీర్తిని ఎన్నుకున్నారు. జయంతి, భారతి, బాలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

ఉప్పునుంతల: మండలంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డులు ఇవ్వాలని సమాచార హక్కు రక్షణ చట్టం 2005 ఉమ్మడి పాలమూరు జిల్లా ఇన్‌చార్జ్ మొగిలి శేఖర్ శనివారం తహసీల్దార్ పాండునాయక్‌ను కలిసి వినతి అందజేశారు.

హరిప్రసాద్‌కు సన్మానం

కల్వకుర్తి: అకిలభారత విద్యార్థి సంఘం లాఫోరం రాష్ట్ర కన్వీనర్ హరిప్రసాద్‌ను శనివారం కల్వకుర్తిలో ఆర్ఎస్ఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. 18 రోజులు చర్లపల్లి జైలులో ఉండి విడుదలై శనివారం కల్వకుర్తికి వచ్చిన సందర్భంగా పట్టణంలో హరిప్రసాద్‌ను సన్మానించారు. బోగరాజు, ఆంజనేయులు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఐకి ఫిర్యాదు

కల్వకుర్తి: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాజుబోడ్‌పై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు శనివారం కల్వకుర్తి ఎస్ఐ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. రమేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కల్వకుర్తి రూరల్: మద్యం దుకాణాల యజమానులు నిబంధనలు పాటించాలని ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేష్ సూచించారు. శనివారం పట్టణంలోని 7 మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో మద్యం బ్రాండ్‌లను, రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

బిజినేపల్లి: మన ఊరు– మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పాఠశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ ప్లానింగ్ కో– ఆర్డినేటర్ నూరుద్దీన్ అన్నారు. శనివారం తిమ్మాజిపేట మండలంలోని ఆవంచకి చెందిన ఎంపీపీఎస్ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు వారికి కావాల్సిన పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలను పరిశీలించారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం



కల్వకుర్తిలో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని చెరువులో చేపపిల్లలను వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మత్స్య సంపదను మత్స్యకారులకే అధికారం ఇచ్చిన సంగతి గుర్తుంచుకోవాలన్నారు. చైర్మన్ ఎడ్మ సత్యం, విజయ్‌గౌడ్, శాహెద్, శ్రీశైలం, మనోహర, గోవర్దన్ పాల్గొన్నారు.

వెల్దండ: మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం వెల్దండ మండల కేంద్రంలో కొండకత్వలో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో కులవృత్తుల కుటుంబాలకు సీఎం కేసీఆర్ పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. భూపతిరెడ్డి, విజితారెడ్డి ఉన్నారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

చారకొండ: మత్స్యకారుల కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండలంలోని జూపల్లిలో కుమ్మరి కుంట చెరువులో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రభుత్వం ఉచితంగా అందించిన 80 వేల చేపపిల్లలను చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సమైఖ్య రాష్ట్రంలో వెనుకబడిన ముదిరాజ్‌లు రాష్ట్రంలో కేసీఆర్ సాధికారతతో వారు ఆర్థికంగా ఎదిగారని పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.వంద కోట్లు పెట్టి వెయ్యి కోట్ల చేప పిల్లను ఉచితంగా అందిస్తుందన్నారు. అన్ని వర్గాల వారిని హక్కున చేర్చుకున్న అభివృద్ధి ప్రదాత కేసీఆర్ అని అన్నారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులకు కృషి చేస్తానని అన్నారు. సీఎం కేసీఆర్ మరోసారి బీఆర్ఎస్ బీ ఫారం ప్రకటించి ఆశీర్వదించారని అన్నారు. ముదిరాజ్‌లు గంగమ్మ ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షల నిధులను మంజూరు చేయాలని వినతి అందించగా.. నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మత్స్యకార ఏడీ లక్ష్మప్ప, సర్పంచ్ మల్లీశ్వరి, రవీందర్, విజయ్‌గౌడ్, బాలేమియా, భూపతి రెడ్డి పాల్గొన్నారు.

లావుని పట్ట రైతులకు పెండింగ్‌లో రుణమాఫీ

లావుని పట్టా(అసైన్ భూమి) రైతులకు బ్యాంకు అధికారులు వచ్చిన రుణమాఫీని ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారని, వెంటనే అధికారులతో మట్లాడి రుణమాఫీని రైతులకు అందించాలని శనివారం జూపల్లికి వచ్చిన ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు లావుని పట్టా రైతులు వినతి అందజేశారు.

విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు



మాట్లాడుతున్న విజేందర్‌సింగ్

పెంట్లవెల్లి: మండల కేంద్రం జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు బలరాంకృష్టారావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలో స్టేట్ ఎడ్యుకేషన్ అచ్చీవ్‌మెంట్ సర్వే వారి ఆదేశాల మేరకు 8, 9వ తరగతి విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఫలితాలను పై అధికారులకు పంపిస్తామని హెచ్ఎం బలరాంకృష్టారావు తెలియజేశారు.

తల్లిదండ్రుల సమావేశం

మండల పరిధిలోని మల్లేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులు విజేందర్‌సింగ్ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల జ్ఞానాన్ని తల్లిదండ్రుల ముందు పరీక్షించడానికి ఈ సమావేశం నిర్వహించినట్లు చెప్పారు.

కేవీకేలో ముగిసిన ఉపాధి కూలీల శిక్షణ



శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త డా.జ్యోత్స్న

బిజినేపల్లి: మండలంలోని పాలెం కేవీకే ఆధ్వర్యంలో ఆహార ఆధారిత సంస్థ స్థాపన కార్యక్రమంలో భాగంగా ఉపాధి కూలీలకు ఇచ్చిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జ్యోత్స్న మాట్లాడుతూ.. మహిళలు అనేక పథకాలను ఉపయోగించుకుని ఆర్థిక స్థిరత్వానికి ముందడుగు వేయాలని ప్రోత్సహించారు. ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఉపాధి మహిళా కూలీలకు ధాన్యాలు, కూరగాయలు, పండ్లతో వ్యాపారానికి ఉపయోగపడే విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, జొన్న మురుకులు, రాగి లడ్డు, మిక్సిడ్ వెజిటబుల్ పచ్చడి, పుచ్చ, నిమ్మకాయలతో ఉండే పండ్ల రసాల తయారీపై శిక్షణ ఇచ్చారు. డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీనివాస్, ఏపీఎం, సుధాకర్, రాములు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి



ప్రచారం నిర్వహిస్తున్న ఆచారి

వెల్దండ: పేద ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి గ్రామంలో ప్రతి కార్యకర్త విస్తృతంగా ప్రచారం చేయాలని జాతీయ మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కొట్ర, కొట్రతండా, బుడ్డోనిపల్లి గ్రామాల్లో 'పల్లెపల్లెకు బీజేపీ– ఇంటి ఇంటికి ఆచారి' అనే నినాదంతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసెంబ్లీ కన్వీనర్ శేఖర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, బాలస్వామి, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామపంచాయతీ నిధుల స్వాహాపై ఫిర్యాదు

బిజినేపల్లి: గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో చేపట్టకుండానే ఓటీపీల ద్వారా నిధులు స్వాహా చేస్తున్నారని శాయిన్‌పల్లికి చెందిన ఉపసర్పంచ్ కుర్మయ్య శనివారం ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. మండలానికి చెందిన ఎంపీఓ రాములు నాయక్, కంప్యూటర్ ఆపరేటర్ రవి పంచాయతీ కార్యదర్శుల నుంచి డిజిటల్ సంతకాల కీ తీసుకుని, ఉపసర్పంచ్‌లకు ఓటీపీలు మాత్రమే పంపి, ఆ ఓటీపీని ఉపసర్పంచ్‌లు తిరిగి అధికారులకు చెప్పక ముందే వారు మెయిల్ ద్వారా తెలుసుకుని ఓటీపీ నమోదు చేస్తున్నారని పేర్కొన్నాడు.

అర్హులకు గృహలక్ష్మి ఇవ్వాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకం కింద అర్హులైన వారందరికీ పథకాన్ని వర్తింప చేసి రూ.5 లక్షలు ఇవ్వాలని రాష్ట్ర రైతు సంఘం నాయకులు వార్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతాంగ పోరాటాల రూపకల్పన చేసేందుకు ఈ నెల 27న స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామని ఈ సదస్సుకు జిల్లాలోని రైతులందరూ అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. బాల్‌రెడ్డి, బాలమురళి, ఆంజనేయులు, బాలస్వామి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం



వార్డు పర్యటనలో మున్సిపల్ చైర్‌పర్సన్

కొల్లాపూర్: పట్టణంలోని 7, 12, 13, 18 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి శనివారం పర్యటించారు. ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను స్థానిక కౌన్సిలర్లతో చర్చించారు. వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం నూతనంగా మంజూరైన నిధుల వివరాలను కౌన్సిలర్లకు వెల్లడించారు. తాగునీటి సమస్యలుంటే వెంటనే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆమె వెంట వర్క్‌ఇన్‌స్పెక్టర్ మన్నెం, కౌన్సిలర్లు డాక్టర్ బరిగెల రాముడుయాదవ్, హైమావతిగౌడ్ తదితరులున్నారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన



బల్మూర్‌లో రాస్తారోకో..



కల్వకుర్తిలో..

నాగర్‌కర్నూల్ రూరల్/ కల్వకుర్తి రూరల్: న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 13వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, జయమ్మ, పద్మ, అలివేలు, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: అంగన్‌వాడీ టీచర్లు శనివారం కొల్లాపూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. 13 రోజులుగా సమ్మె చేస్తున్నా తమ సమస్యలపై ప్రభుత్వం చర్చలు చేపట్టకపోవడం దారుణమన్నారు.

ఉరి వేసుకుని నిరసన..

తాడూరు: అంగన్‌వాడీ టీచర్లు శనివారం ఉరేసుకుని నిరసన వ్యక్తం చేశారు.

బల్మూర్: అంగన్‌వాడీ టీచర్లు బల్మూర్‌లో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

సఖి సెంటర్ సేవలపై ఆరా

కందనూలు: జిల్లాకేంద్రంలోని సఖి సెంటర్‌ను సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సబిత, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మౌనిక జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మితో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలు, ఐసీపీఎస్, చైల్డ్ లైన్ సేవల గురించి తెలుసుకున్నారు. అలాగే బాధిత మహిళలకు అందిస్తున్న సోషల్ కౌన్సిలింగ్, లీగల్ కౌన్సిలింగ్, పోలీస్, వైద్యసిబ్బంది సహాయం, తాత్కాలిక వసతి, బాధిత మహిళలకు అందిస్తున్న వెల్‌కం కిట్టు గురించి ఆరాతీశారు. సఖి స్టాఫ్ చైల్డ్ లైన్ స్టాఫ్, ఉమెన్ హబ్ కోఆర్డినేటర్ శ్వేత, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ మౌనిక, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రపంచ బధిరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లాకేంద్రంలోని రామాలయవీధి ప్రాథమిక పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చెవి, ముక్కు, గొంతు సమస్యలపై వైద్య శిబిరం నిర్వహించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



ఊర్కొండ: మండల పరిధిలోని జకినాలపల్లికి చెందిన గుండ్లపల్లి వెంకటయ్యకు మంజూరైన రూ.1.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆయన అల్లుడు మల్లయ్యకు శనివారం సర్పంచ్ అనిల్‌రెడ్డి అందజేశారు.

కోడేరు: మండల కేంద్రానికి చెందిన కృష్ణమ్మకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.29,500ల చెక్కును సర్పంచ్ వెంకటస్వామి అందజేశారు.

'కేసీఆర్ సర్కార్‌ను ఓడించడం ఖాయం'

అచ్చంపేట రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ సర్కార్‌ను ఓడించడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం అచ్చంపేట మండలం పల్కపల్లిలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం చేశారు. ఇటీవల తుక్కుగూడలో సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూరం రమేష్‌రెడ్డి యూత్ కాంగ్రెస్ 100 మంది సభ్యులకు టీ షర్టులను అందజేశారు. గోపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నారణ్‌రెడ్డి, శేఖర్, శివ పాల్గొన్నారు.

రూ.5వేల జరిమానా

తెలకపల్లి: ఉపాధిహామీ పథకంలో పనిచేసిన కూలీల వివరాల అక్రమాలపై శుక్రవారం రాత్రి వరకు మండల సామాజిక తనిఖీ సభ నిర్వమించారు. మండలంలోని పనుల వివరాలు, అక్రమాలపై చర్చించారు. మండల పరిధిలోని బొప్పల్లిలో రూ.3 వేలు, కార్వంగలో రూ.1000, రాకొండలో రూ.1,000 మొత్తం 5 వేల అక్రమాలు జరిగినట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలియజేశారు. రూ.26,656 రికవరీకి ఆదేశించినట్లు తెలియజేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతుంది. శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించడంతో పాటు 6 నెలలుగా పెండింగ్‌లోని బిల్లులు చెల్లించకుండా తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. మధ్యాహ్న భోజన కార్మికులు కృష్ణవేణి, భాగ్యమ్మ, లక్ష్మి, నర్సమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి



పెంట్లవెల్లి: గ్రామాల్లో నిరంతరం ప్రజలకు సేవ చేస్తున్న ఆశవర్కర్లకు నెలకు రూ.18 వేలు రాష్ట్ర ప్రభుత్వం అందించాలని ఆశవర్కర్లు శనివారం పెంట్లవెల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో డా. సంధ్యకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా నాయకురాలు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మాకు వేతనాలు చెల్లించకుంటే ఈ నెల 25 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 28 వేల మంది ఆశవర్కర్లతో సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో శారద, ప్రసన్న, జ్యోతి, మమత, శివలక్ష్మి పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్



అచ్చంపేట పట్టణంలోని శాలివాహన ఫంక్షన్ హాల్‌లో..



నాగర్‌కర్నూల్ త్రిదలన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద..

మీరు పర్యావరణ పరిరక్షణలో భాగమై మట్టి గణేశుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారా.. జిల్లాలోని అపార్ట్‌మెంట్, కమ్యూనిటీ లేదా ఇళ్లలో ప్రత్యేక ఆకృతుల్లో ఏర్పాటు చేశారా. అయితే మీ విగ్రహ ప్రత్యేకతలను 'సాక్షి'తో పంచుకోండి. మట్టి, ప్రత్యేక ఆకృతుల విగ్రహాలతో సెల్ఫీ తీసి వాట్సాప్ చేయండి. మీ పేరు, చిరునామాను స్పష్టంగా పంపించండి. ఎంపిక చేసిన ఫొటోలను ప్రచురిస్తాం.

వాట్సాప్ చేయాల్సిన నంబర్ 82473 73051

నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

వినాయక చవితి నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని నాగర్‌కర్నూల్ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వినాయక నిమజ్జనంలో మద్యం తాగి ఊరేగింపులో పాల్గొనకూడదని సూచించారు.

వినాయకుల నిమజ్జనం

డప్పు చప్పుళ్లు, మంగళవాయిద్యాలు, నృత్యాల హోరుతో గణపతి బప్పా మోరియా అంటూ భక్తులు హోరెత్తించారు. శనివారం అచ్చంపేట పట్టణంతో పాటు పలు మండలాల్లో వినాయక నిమజ్జనం చేశారు. అంతకు ముందు లడ్డూలను వేలం వేశారు.

– 'సాక్షి' నెట్‌వర్క్



తాడూరులో లడ్డూ గ్రహీత స్వేత ఆంజనేయులు



తిమ్మాయిపల్లిలో సన్మానం పొందిన లడ్డూ గ్రహీత



అచ్చంపేటలో నిమజ్జనం చేస్తున్న భక్తులు



అమ్రాబాద్‌లో..



వెల్దండలో పూజలు చేస్తున్న నాయకులు



తాడూరు పూజలో పాల్గొన్న రాజేష్‌రెడ్డి

ఎర్రపెంటలో వైద్యశిబిరం



ఎర్రపెంటలో చెంచులను పరీక్షిస్తున్న వైద్యులు

లింగాల: మండల పరిధిలోని ఎర్రపెంటలో చైతన్య చారిటబుల్ ట్రస్టు మరియు సురక్ష ప్రజావైద్యశాల అచ్చంపేట ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు చైతన్య, నాగార్జున పెంటలోని చెంచులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

అమ్రాబాద్: మన్ననూర్ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. 189 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మహిళ బిల్లును అమలు చేయాలి

వెల్దండ: కేంద్ర ప్రభుత్వం రాబోయే ఎన్నికల కోసం మహిళ బిల్లు ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం వెల్దండలో విలేకరులతో మాట్లాడారు. మహిళలపై చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించి చట్ట సభలో మహిళలకు న్యాయం కల్పించాలన్నారు.

ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సాట కాశీం డిమాండ్ చేశారు. శనివారం అచ్చంపేటలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అచ్చంపేట ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా సామాన్య ప్రజలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్, రాజు, వెంకటేష్, చరణ్ పాల్గొన్నారు.

దళితుల మధ్య చిచ్చు పెట్టొద్దు

మన్ననూర్: ఆచరణ సాధ్యం కాని ఎస్సీ వర్గీకరణ చేస్తామని అవకాశవాద రాజకీయ పార్టీల నాయకులు ఆశలు పెట్టి దళితుల మధ్య చిచ్చు పెట్టవద్దని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల దివాకర్ అన్నారు. శనివారం మన్ననూర్‌లో ఆయన మాల మహానాడు నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చెల్లదని అది రాజ్యాంగ విరుద్ధమని గతంలో సుప్రీంకోర్టు తెలియజేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

తెలకపల్లి: బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ బాధ్యతగా పనిచేయాలని గౌరెడ్డిపల్లి సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆర్గనైజర్ సునిత అన్నారు. శనివారం మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలపై చర్చించారు. సర్పంచ్ వెంకట్‌రెడ్డి, అనిత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు పని కల్పించాలి

చారకొండ: గ్రామాల్లో ఉపాధి కూలీలకు ప్రతి గ్రామంలో 20 మందికి తగ్గకుండా పని కల్పించాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని శేరి అప్పారెడ్డిపల్లిలో శనివారం ఎంపీడీఓ జయసుధ, సర్పంచ్ రంగారెడ్డితో కలిసి గ్రామంలో పర్యటించారు.

బీఎంపీతోనే రాజ్యాధికారం

నాగర్‌కర్నూల్ రూరల్: బీఎంపీ అధికారంలోకి రావడంతోనే రాజ్యాధికారం సాధ్యం అవుతుందని బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అమ్‌సోల్ లక్ష్మణ్ అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 85 శాతం ఉన్న బహుజనుల కోసం దేశవ్యాప్తంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్న పార్టీ బహుజన ముక్తి పార్టీ మాత్రమే అని అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గడ్డం విజయ్ అధ్యక్షత వహించగా.. జిల్లా కన్వీనర్ చంద్రస్వామి, రవీంద్రమాలి, దసరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.